## సోయా పంట చోరీకి యత్నం

తాంసి(భీంపూర్), అక్టోబర్ 15 : కల్లంలో పోసిన సోయా పంటను దుండగులు ఎత్తు కెళ్లేందుకు యత్నించిన ఘటన భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో మంగళ వారం జరిగింది. రైతు కల్లెం భగవాన్‌రెడ్డి తన చేనులో సోయా పంట తీసి ఒక చోట కుప్పలుగా పోశాడు. మంగళవారం మధ్యాహ్నం చేనులో ఎవరూ లేనప్పుడు గుర్తు తెలియని వ్యక్తులు వాటిని మూట లుగా కట్టి చోరీ చేసేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో భగవాన్‌రెడ్డి చేనులోకి వస్తుండడాన్ని గమనించి ఆగంతకులు రార య్యారు. ఈ విషయంపై రైతు భీంపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్యా యత్నం

కడెం, అక్టోబర్ 15: మండలంలోని మాసా యిపేట గ్రామానికి చెందిన మద్దెల ప్రవీణ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కడెం ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి వివరాల ప్రకారం ప్రవీణ్ భార్య కొన్ని రోజులుగా కాపురానికి రావడం లేదని, మనస్తాపంతో మంగళ వారం అతిగా మద్యం తాగాడు. కడెం ప్రాజె క్టులో దూకి ఆత్మహత్య చేసుకుంటానని డయల్ 100కు కాల్ చేయడంతో తక్షణమే బ్లూ కోల్ట్స్ సిబ్బంది ప్రాజెక్టు వద్దకు చేరు కొని ప్రవీణ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి నట్లు, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## అటవీ భూమి కబ్జాకు పాల్పడిన వారిపై కేసు

ఖానాపూర్ రూరల్/ఖానాపూర్, అక్టోబర్ 15 : ఖానాపూర్ మండలంలోని పాత తర్ల పాడు, సత్తనపల్లి గ్రామ శివారులోని అటవీ భూముల కబ్జాకు పాల్పడిన ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో కిరణ్ తెలి పారు. కొత్త తర్లపాడుకు చెందిన బోసు భూమన్న, సూర తిరుపతి సత్తనపల్లి గ్రామ శివారులో రిజర్వ్ ఫారెస్ట్ భూమిని ట్రాక్టర్‌తో చదును చేసి కబ్జా చేసుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసి నిర్మల్ జిల్లా న్యాయ స్థానంలో హాజరు పరి చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అటవీ క్షేత్రాల్లోకి చొరబడి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 15 : ఖానా పూర్ మండలంలోని బాదనకుర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని పలుగురాళ్ల గుట్ట సమీపంలో సోమవారం రాత్రి గుర్తు తెలి యని దుండగులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారని ఎస్ఐ రాహుల్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం గ్రామంలో 16 కేవీఏ ట్రాన్స్ ఫార్మర్‌ను పగులగొట్టి అల్యూమినియం కాయిల్స్‌ను దొంగలించారన్నారు. ఖానా పూర్ ఏఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఇచ్చోడలో బంద్ ప్రశాంతం

ఇచ్చోడ, అక్టోబర్ 15 : ఓ వర్గానికి చెందిన ప్రవక్తపై ఓ వ్యక్తి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఇచ్చోడలో బంద్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచి దుకాణాలు బంద్ ఉండడంతో మార్కెట్ బోసిపో యింది. ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా పోలీసులు భారీ బందో బస్తు నిర్వహించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

ఉట్నూర్ రూరల్, అక్టోబర్ 15: మండలం లోని శ్యాంపూర్ సమీపంలో మంగళవారం రాజన్న గూడకు చెందిన సీలం నగేశ్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం నగేశ్ ఉట్నూర్ వైపు ద్విచక్రవాహనంపై వస్తుం డగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవా హనం ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో ఇంద్ర వెల్లి మండలానికి చెందిన కుమ్ర రాజు వెను కనే ద్విచక్ర వాహనంపై వస్తూ కింద పడ్డ వాహనాన్ని తప్పించబోయి డివైడర్‌కు ఢీకొ ట్టడంతో వారికి సైతం గాయాలయ్యాయి. వెంటనే సమీప శ్యాంపూర్ పీహెచ్‌సీ తర లించి చికిత్స అందించారు.

### మహాలక్ష్మి వాడలో ఆటో దగ్ధం

ఎదులాపురం, అక్టోబర్ 15 : పట్టణంలోని మహాలక్ష్మి వాడ నివాసముండే జాదవ్ పండిత్‌కు చెందిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఈ మేరకు బాధి తుడు టూ టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీహెచ్ కరుణాకర్ రావు తెలిపారు.

## రోడ్ల నిర్మాణానికి రూ. 5 కోట్లు మంజూరు

భైంసా, అక్టోబర్, 15: నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 5 కోట్లు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే రామారావు పటేల్ తెలిపారు. బాసర మండలంలోని ఓని గ్రామం నుంచి బాసర వరకు రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు, నర్సాపూర్ (జీ) మండలంలోని అంబకంటి నుంచి నందన్ వరకు రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు, భైంసా మండలం వానల్‌పాడ్ నుంచి పెండ్‌పెల్లికి కోటి రూపా యల నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

## ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలి

నార్నూర్, అక్టోబర్ 15 : గాదిగూడ మండలంలోని మారేగావ్, కొలామా, బుద్ధగూడ, డొంగర్‌గావ్, రాంపూర్, కునికసా, పొనూర్, కౌటాల, చిన్నకుండి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను నియ మించాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మెస్రం శేఖర్‌బాబు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో విద్యాశాఖ జిల్లా అధికారి ప్రణీతకు వినతిపత్రాన్ని అందజేశారు. ఉపాధ్యాయులు లేక గిరిజన పిల్లలు విద్యకు దూరమవుతున్నారని డీఈవో దృష్టికి తీసుకె ళ్లారు. ఈ పాఠశాలలో ఉపాధ్యాయులను భర్తీ చేసి గిరిజన పిల్లలకు విద్యనందించేలా చూడాలని కోరారు.

## పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ఎదులాపురం, అక్టోబర్ 15 : రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ఆర్టీఎఫ్ (రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజు), ఎంటీఎఫ్(మెయిం టనెన్స్ ఆఫ్ ట్యూషన్ ఫీజు)కు సంబంధించిన బకాయిలు వెంటనే చెల్లించాలని టీపీడీపీఎంఏ(తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజ్ మేనే జ్‌మెంట్ అసోసియేషన్) ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ఏడాదికోసారి లేదా రెండేళ్ల కోసారి ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించేవారని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని ఆవే దన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించిన తర్వాతే కళాశాలలు ప్రారం భిస్తామన్నారు. సమావేశంలో టీపీడీపీఎంఏ అధ్యక్షుడు హన్మాండ్లు, ప్రతినిధులు పొన్నరావు, బిలాల్, గోపాల్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కమిటీలు నిబంధనలకు విరుద్ధం

నార్నూర్, అక్టోబర్15:ఏజెన్సీలో ఇందిరమ్మ కమిటీల ఎంపిక ప్రక్రియ నిబంధనలకు విరుద్ధమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి అర్కా గోవిందరావు అన్నారు. మంగళ వారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఏజె న్సీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ కమిటీల ఎంపిక ప్రక్రియ పెసా చట్టానికి విరుద్ధంగా ఉందన్నారు. పెసా చట్టానికి అను గుణంగా కమిటీలను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆదివాసీ సంఘాలతో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## వార సంతలో పన్నులు వసూలు చేయద్దు

బోథ్, అక్టోబర్ 15 : బోథ్‌లో ప్రతి మంగళవారం జరిగే వారసంతలో కూరగాయలు విక్రయించేందుకు వచ్చే రైతుల నుంచి తైబజార్ పన్ను వసూలు చేయొద్దని మంగళవారం వాంకిడి, వడూర్, కొర్టికల్, పొచ్చెర తదితర గ్రామాలకు చెందిన రైతులు మండల పరిషత్ కార్యా లయానికి వచ్చి ఎంపీడీవో జీవన్ రెడ్డికి విన్నవించారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ

ఉట్నూర్, అక్టోబర్15 : జైనూర్ మండల కేంద్రంలోని ఆదివాసీ నిరు పేదలకు క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావ సర సరుకులు పంపిణీ చేశామని రీజినల్ మేనేజర్ చంద్రశేఖర్ వార ణాసి మంగళవారం తెలిపారు. 23 మందికి సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు నరేశ్‌రెడ్డి, షేక్ జానీభాషా, బీఎం ప్రమోద్, సూర్యశేఖర్ భూక్యా ఉన్నారు.

## ఎమ్మెల్యేను విమర్శించడం తగదు

ఉట్నూర్,అక్టోబర్ 15 : మాలజాతి ముద్దుబిడ్డ చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని విమర్శించే స్థాయి ఎమ్మార్పీఎస్ నాయ కులకు లేదని మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్రదండి సుశీల్ కుమార్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ పట్టణంలోని ప్రెస్ భవ న్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ..ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వివేక్ పాల్గొని ఎస్సీ వర్గీకరణ చేయాలంటే 2024జనాభా గణన పూర్తి చేసే వర్గీకరణ చేయాలని మాత్రమే అన్నారన్నారు. దీనిపై ఎమ్మెల్యేను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని చెప్పే హక్కు ఎమ్మార్పీఎస్ నాయకులకు లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాటం రమేశ్,తౌటి ఆశన్న, కడమండ్ల రాజమణి, నందం, కోడి ప్రభాకర్, మంత్రి రాజన్న ఉన్నారు.

### ‘అలయ్ బలయ్‌లు కాదు..నిధులు సాధించాలి’

ఎదులాపురం,అక్టోబర్ 15: ‘అలయ్ బలయ్‌లతో కాదు..బీజేపీ పార్టీ పోరాడి నిధులను సాధించాలని మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. సీపీఐ(ఎం) పార్టీ ఆదిలా బాద్ జిల్లా 13వ మహాసభల ఏర్పాట్ల పరిశీలనకు మంగళవారం వచ్చారు. జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఆదిలా బాద్ సమీపంలో ప్రభుత్వ సిమెంట్ పరిశ్రమ సీసీఐను గత పాలకులు మూసివేశారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఎన్నికల సంద ర్భంగా సీసీఐని తిరిగి ప్రారంభిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పత్తి పంటను ఎక్కువగా పండిస్తున్నారని, ప్రభుత్వం టెక్స్ టైల్ పార్కును ఏర్పాటు చేయాలన్నారు. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వే లైన్‌ను నిర్వహించాలని పేర్కొన్నారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న విమానాశ్రయం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపునకు స్థానిక బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు కృషి చేయాలన్నారు. గిరిజన యూనివర్సిటీని మంజూరు చేయాల న్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్, తొడసం భీంరావు, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంకా రాఘవులు, కిరణ్ పూసం సచిన్ సీని యర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆత్రం కిష్టన్న, గంగన్న, సురేందర్ మంజుల, తదితరులు పాల్గొ న్నారు.

## దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం, అక్టోబర్ 15 : ఈనెల 13న రూరల్ మండలంలోని రామాయి వద్ద ముగ్గురు వ్యక్తులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ డివిజన్ తుడుందెబ్బ అధ్యక్షుడు జంగు పటేల్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ విషయమై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. నిందితులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కులం సేవ సంఘం ఆదిమ గిరిజన వ్యవస్థాపక అధ్యక్షుడు కొడప సోనేరావ్, మండల ప్రధాన కార్యదర్శి గెడం రాము, ప్రధాన్ పురోహిత్, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి దేవిదాస్, జాదవ్ రోహిదాస్, రాథోడ్ రోహిదాస్ పాల్గొన్నారు.

## అట్రాసిటీ కేసు నమోదు

ఎదులాపురం, అక్టోబర్ 15 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రామాయి వద్ద ఈ నెల 13న జరిగిన దాడి కేసులో 8 మందితోపాటు మరికొందరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. ఈనెల 13న వాహనంలో డీజే తీసుకొని పోతున్న క్రమంలో రోడ్డుకు అడ్డంగిచి దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో దాడి కేసు నమోదు చేశారు. రోహిదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రాథమిక విచారణ జరిపి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుగా నమోదు చేశారు. ఈ కేసులో రామాయి గ్రామా నికి చెందిన జిట్టా ప్రభాకర్, జిట్టా రత్నాకర్, శ్యాంభాయ్, అనిల్, ఈశ్వర్, జ్ఞానేశ్వర్, ఇస్తారి, దత్తుతోపాటు మరికొందరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ డీఎస్పీ వెల్లడించారు.

## కుమ్రం భీం వర్ధంతిని విజయవంతం చేయాలి

బోథ్, అక్టోబర్ 15 : ఈ నెల 17న మండలకేంద్రంలో నిర్వహించే కుమ్రం భీం వర్ధంతిని విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి బోథ్ డివిజన్ అధ్యక్షుడు దుర్వ విశ్వేశ్వర్ రావ్ కోరారు. ఈ సమావేశంలో మండల కమిటీ అధ్యక్షుడు కనక అమృత్ రావ్, కార్యదర్శి మండాడి రాము పాల్గొన్నారు.

**ఇచ్చోడ, అక్టోబర్ 15 :** కుమ్రం భీం వర్ధంతిని విజయవంతం చేయా లని మేడిగూడ రాయిసెంటర్ సార్మెడి పిలుపునిచ్చారు.



బోథ్ అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు



తలమడుగులో..



కుంటాలలో..

# అబ్దుల్ కలాం ఆశయాలను నెరవేర్చాలి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 15 : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను నెరవేర్చేం దుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. మంగళవారం పురపాలక సంఘం ఆధ్వ ర్యంలో 93వ జయంతిని ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నిర్మ ల్‌లో అబ్దుల్ కలాం విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈద్గాం చౌరస్తా వద్ద ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహ మ్మద్ అజారొద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



నిర్మల్‌లో అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పి మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, నాయకులు

**బోథ్, అక్టోబర్ 15 :** మండలంలోని సొనాల గ్రామంలో మంగళవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పూలే వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గాజుల పోతన్న, ప్రధాన కార్యదర్శి రమేశ్ బత్తుల, సభ్యులు అమృత్‌రావ్ పాటిల్, కొప్పెర్ల శేఖర్, గోరేభాయ్, అంకుష్, మహబూబ్, అనిల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

**తలమడుగు, అక్టోబర్ 15 :** మండలకేంద్రంలో బ్లూ భీం యూత్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు గొంటిముక్కల ప్రేమేం దర్, గంగాధర్, గంగన్న, శివమణి, సందీప్, ఈశ్వర్, సాయి పాల్గొన్నారు.

**కుంటాల, అక్టోబర్, 15:** దేశ మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని వక్తలన్నారు. బస్టాండ్ ఆవరణలో కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు జక్కు ల గజేందర్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి శివ, పవన్, తెడ్డు రమేశ్, సాగర్, శశి, వినోద్, తదితరులున్నారు.

## సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ఉట్నూర్ రూరల్, అక్టోబర్ 15: పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదా రుల సమస్యలను త్వరగా పరిష్కరిం చాలని ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం మండలంలోని పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరిం చారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి స్వాగతం పలికారు. అనంతరం కార్యాల యాన్ని తనిఖీ చేశారు. నూతన భవన నిర్మాణ పనులను పరిశీలిం చారు. అనంతరం ఎస్పీ మాట్లా డుతూ యువత వ్యసనాల బారిన పడకుండా అవగాహన కార్యక్ర మాలు ఏర్పాటు చేయాలని అన్నారు. రికార్డుల నిర్వహణ, కేసుల పరిశోధన, దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. విధులపై నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి, ఎస్ఐ మనోహర్, రహీంపాషా, సీసీ రమణ, సిబ్బంది ఉన్నారు.

## టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఉద్రిక్తత

ఎదులాపురం, అక్టోబర్ 15 : ఆదిలాబాద్ జిల్లా డీఎస్సీ నియా మకాల్లో అక్రమాలు జరిగాయంటూ మంగళవారం డీఈవో కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. డీఎస్సీ అభ్యర్థులకు మద్దతుగా నిలిచిన ఆందోళన చేపట్టి ప్రభు త్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలోనే ఆందోళ నకారులను వన్ టౌన్ పోలీసులు వారిని సముదాయించే ప్రయత్నం చేయగా వినలేదు. దీంతో అక్కడి నుంచి ఆందోళనకా రులను పోలీసులు అదుపులోకి తీసుకుని టూ టౌన్‌కు తీసుకె ళ్లారు. టూ టౌన్ ఎదుట పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు గుమిగూ డారు. దీంతో టూ టౌన్ ఎదుట ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొన్నది. ఆందోళనకారుల్లో బీజేపీ నాయకులు పాయల్ శరత్(బన్నీ)తో పాటు మరికొందరిని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

## గుండెగావ్‌కు న్యాయం జరిగే వరకు పోరాడుతాం

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 15 : గుండెగావ్ ప్రజలకు న్యాయం జరిగే వరకు సీపీఐ పోరాడుతుందని ఆ పార్టీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు భూమయ్య అన్నారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భైంసా మండలంలోని గుండెగావ్ గ్రామాలు ముంపునకు గురై 10 సంవత్సరాలైందని గత ప్రభుత్వం రూ.94 కోట్ల నిధులను విడుదల చేసినప్పటికీ రూ.61 కోట్లు మంజూరు చేసిందని మరో రూ.33 కోట్లు ప్రతిపాదనలను పంపిస్తామన్నారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఇందుకు నిరసనగా బుధవారం కలెక్టరేట్ ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్ ఎన్ రెడ్డి, ఉపాలి, లక్ష్మణ్, మల్కన్న తదితరులున్నారు.

## పరిశుభ్రతతో వ్యాధులు దూరం

లక్ష్మణచాంద, అక్టోబర్ 15 : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని వరల్డ్‌విజన్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినే టర్ కరుణాకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని బాబాపూర్ గ్రామంలో వరల్డ్‌విజన్ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో గ్లోబల్ హ్యాండ్ వాష్‌డేను నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధర్మేంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, ఉపాధ్యాయులు, వరల్డ్‌విజన్ సంస్థ సిబ్బంది, విద్యార్థులున్నారు.

**ఎదులాపురం, అక్టోబర్ 15 :** పట్టణంలోని సుందరయ్యనగర్ కాలనీ లోని అంగన్‌వాడీ కేంద్రంలో చేతులు పరిశుభ్రత దినోత్సవం నిర్వ హించారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే నినాదంతో పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ కార్యకర్త రాధా, ఏఎన్ఎం తులసి, ఆర్‌పీ ఫరీదా, ఏఎల్ఎంఎస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా జైలు సందర్శన

ఎదులాపురం, అక్టోబర్ 15 : ఖైదీలు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్ ఉప సహాయ న్యాయవాదులున్నారు. మంగ ళవారం జిల్లా జైలును సందర్శించి ఖైదీలతో మాట్లాడి సమస్యలు, కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఖైదీలు ఏదైనా కేసులో బెయిల్ కోసం దరఖాస్తు చేసేటప్పుడు వారి ఆర్థిక స్థితి, అక్షరాస్యత ఆధారంగా వివక్ష చూపకూడదని, పరిస్థితిని బట్టి కొన్ని కఠినమైన షరతులను సడ లించేందుకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ సిస్టమ్ పని చేస్తుందన్నారు.

## దేశాభివృద్ధిలో మహిళా రైతుల పాత్ర కీలకం

బోథ్, అక్టోబర్ 15 : దేశాభివృద్ధిలో మహిళా రైతుల పాత్ర కీలకమని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. మంగళవారం మండలంలోని ధన్నూర్(బీ) గ్రామంలో జాతీయ మహిళా రైతుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీ సాయమ్మ, అశ్విని, ఉమా, రుక్మిణి, ప్రమీల, చంద్రకళ పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

తలమడుగు, అక్టోబర్ 15 : పారిశుధ్య నిర్మూలనపై గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో ఫణిందర్ అన్నారు. మంగళవారం మండలంలోని సుంకిడి, పల్సి(బీ) గ్రామాల్లో పర్యటిం చారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులతో డీఎల్పీవో మాట్లా డుతూ గ్రామాల్లో అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాల న్నారు. పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువు తయారీపై పలు సూచనలు చేశారు. అనంతరం అంగన్ వాడీ కేంద్రాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీ ఈవో చిలుకూరి సుధీర్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి సచిన్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసుల ప్రత్యేక పూజలు

ఇంద్రవెల్లి, అక్టోబర్15 : ఆదివాసీల ఆరాధ్యదైవం మండలకేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీలు దసరా ప్రత్యేక పూజలు చేశారు.మంగ ళవారం పాటగూడ, జెండాగూడ, వడగాం, ఆదిలాబాద్ బోరజ్, ఉట్నూర్, గుడిహత్నూర్, నార్నూర్, జైనూర్, గాదిగూడ, సిరికొండ మండలాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు కుటుంబ సమేతంగా ఇంద్రాదేవి ఆలయానికి తరలివచ్చారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వంటలు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు.


## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

ఇంద్రవెల్లి, అక్టోబర్15 : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని రైతులకు పశుసంవర్ధక శాఖ నిర్మల్ జిల్లా అధికారి జులురి రవికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ఏమాయికుంటలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పశువుల యజమానులకు పలుసూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి, ముత్నూర్ పశువైద్యాధికారులు రాథోడ్ సుభాష్, సుదేశ్, మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్‌సింగ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

భైంసాటౌన్, సెప్టెంబర్ 15: మండలంలోని ఇలేగాం గ్రామానికి చెందిన కాంబ్లే దేవిదాస్(34) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని భైంసారూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఎస్ఐ, కుటుంబ సభ్యులు తెలి పిన వివరాలు ప్రకారం..దేవిదాస్ మద్యానికి బానిసై ఏ పని చేయకపోవడంతో సోమవారం ఉదయం భార్య మీరాబాయితో గొడవ పడి ఆమె వద్ద నుంచి డబ్బులు తీసుకెళ్లాడు. భార్య వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లి సాయంత్ర వచ్చే సరికి భర్త ఇంటిలో తలుపులు లోపల నుంచి గడియ పెట్టుకొని ఉన్నాడు. గడియ తీయకపోవడంతో ఇంటి వెనకాల నుంచి వెళ్లి చూడగా దేవిదాస్ పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే బంధువులు 108లో భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిశిలించిన వైద్యులు మృతి చెందాడని ధ్రువీకరించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీ సులు వెల్లడించారు.

# బుద్ధుడి బోధనలు అనుసరణీయం



ప్రవచనాలు బోధిస్తున్న పూజ్యభంతేజీలు జీవక్, పుర్ణ, ప్రజ్ఞశీల్

ఇంద్రవెల్లి, అక్టోబర్15 : ప్రపంచానికి శాంతి అహింసాయుత మార్గాన్ని చూపిన బుద్ధుడి బోధనలు మానవులకు అనుసరణీయమని పూజ్యభంతేజీలు జీవక్, పుర్ణ, ప్రజ్ఞశీల్ అన్నారు. మంగళవారం మండలంలోని ప్రభుద్ధనగర్ బుద్ధ విహార్‌లో ఆషాఢ పౌర్ణిమ, జూలైలో ప్రారంభమైన బౌద్ధ వర్షవాస్ దివ స్‌లో భాగంగా మూడు నెలలుగా కొనసాగిన బుద్ధ ధమ్మ గ్రంథంపై బోధించిన ప్రవచనాల తోపాటు వర్షవాస్ దివస్‌ను ఘనంగా ముగింపు పలికారు. బౌద్ధ ఉపాసకులు సాము హికంగా బుద్ధవందన, ధమ్మవందన, సంఘ వందనతోపాటు త్రీశరన్, పంచశీల్‌ను తీసు కున్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షులు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధానకార్య దర్శి వాగ్మారే కామ్‌రాజ్, ఉపాధ్యక్షుడు పవార్ శివాజీ, కోశాధికారి సునీల్, సంతోష్‌దుండే, సునీల్ కాంబ్లే, మస్కేరాజ్‌వర్ధన్, సోన్‌కాంబ్లే గోపి నాథ్, మహామాయా ఉపాసిక మహిళలు తది తరులు పాల్గొన్నారు.

**భీంనగర్‌లో..**మండలంలోని భీంనగర్‌లో సోమవారం రాత్రి భీంనగర్‌లో ధమ్మచక్ర పరి వర్తన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుద్ధు డితోపాటు అంబేద్కర్ చిత్రపటాలకు నివాళు లర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృ తిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షకార్యద ర్శులు సోన్‌కాంబ్లే మనోహర్, వాగ్మారే కామ్ రాజ్, మాజీ ఎంపీటీసీ ఆశాబాయి, యూత్ సభ్యులు థిట్టే సుమిత్, సంతోష్, కృష్ణ, మండల నాయకులు ముకాడే ఉత్తం, ఎండీ జహీర్, సోన్‌కాంబ్లే జితేందర్, సావంత్ లహు దాస్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.



దస్తురాబాద్ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు

## ఘనంగా బతుకమ్మ వేడుకలు

దస్తురాబాద్, అక్టోబర్ 15 : సద్దుల బతుకమ్మ పండుగ మండలం లోని పలు గ్రామాల్లో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను పెట్టి చిన్న పెద్ద లేకుండా మహి ళలు, యువతులు, చిన్నారులు నృత్యాలను చేశారు. సమీప చెరు వుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

**భీంపూర్, అక్టోబర్ 15 :** భీంపూర్ మండలంలోని గ్రామగ్రామానా బతుకమ్మ వేడుకలను కనులపండువగా నిర్వహిస్తున్నారు. దసరా రోజు రాత్రి చిన్న బతుకమ్మ నిర్వహించారు. మరో వారంలోగా సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## కూలీలకు అవసరమయ్యే పనులు కల్పించాలి

దిలావర్‌పూర్, అక్టోబర్ 15 : ఉపాధి హామీ పథకం పనిచేసే కూలీ లకు అవసరమైన పనులతో పాటు పలు అభివృద్ధి పనులకు గుర్తిం చాలని ఈజీఎస్ ఏపీవో దివ్యారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని మాడెగాం, కదిలి గ్రామాల్లో ఉపాధిహామీ గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్స రంలో చేపట్టే పనులపై గ్రామసభలో చర్చించి తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కూలీలు, గ్రామస్తులున్నారు.

## వర్గీకరణ పేరుతో తప్పుడు ప్రచారం

కడెం, అక్టోబర్ 15: వర్గీకరణ పేరుతో మందకృష్ణ మాదిగ దళిత కులాల్లో చిచ్చు పెట్టి తప్పుడు ప్రచారం చేయడం, స్థానిక నాయ కులు తెలిసి తెలియని జ్ఞానంతో తప్పుడు ప్రచారం చేయడం సరి కాదని దళిత ఉపకులాలు మాల, నేతకాని సంఘాల నాయకులు మండిపడ్డారు. మంగళవారం కడెం మండలకేంద్రంలోని అంబే ద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. పెరిగిన ఎస్సీల జనాభా ప్రకారం హక్కులను పెంచా లాని డిమాండ్ చేయాల్సింది పోయి, ఉన్న హక్కులను ఏ, బీ, సీ, డీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేయడం అవివేకమని మండి పడ్డారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కమిటీ, ఏకసభ్య సింగిల్ జడ్జి కమిటీ మరోసారి శాస్త్రీయంగా సర్వే చేసి అణగారిన వర్గాలకు న్యాయం చేసేలా ఉండాలని, సుప్రీంకోర్టు ఎడుగురి జడ్జిల తీర్పు మతో న్మాద బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల తీర్పు కుల రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్రలో భాగమేనని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ల రమేశ్, నేతకాని మహార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గె వెంకటేశ్, నాయకులు మల్లె పెల్లి గంగారాం, అలింకంపేట గంగాధర్, పెద్దూర్ రాజు, పీ సత్తన్న, దుర్గం గంగాధర్, తలారి రాజేందర్, తదితరులున్నారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

కుంటాల, అక్టోబర్, 15: నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్ఐ భాస్కరాచారి అన్నారు. మంగళవారం కల్లూర్‌లో ప్రజల సహకారంతో జీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 10 రిపేర్డ్, 4 కొత్త సీసీ కెమెరా లను ప్రారంభించారు. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్ర ప్రారంభం

లోకేశ్వరం, అక్టోబర్, 15 : మండంలోని అబ్దుల్లాపూర్‌లో డీసీ ఎంఎస్ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ డీఆర్డీవో విజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తోట గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

## నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

దిలావర్‌పూర్ అక్టోబర్ 15 : అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నా రులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఎంపీవో గోవ ర్ధన్ సూచించారు. మంగళవారం మండలంలోని మాడెగాం, కదిలి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలిం చారు. స్టాక్ రిజిష్టర్, కోడిగుడ్లను పరిశీలించారు. పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీల్, గ్రామస్తులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్,15: నిర్మల్ పట్టణంలోని మంజులా పూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం సీడీపీవో నాగమణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ నిల్వలు పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం లబ్ధిదారులకు గుడ్లు, పోష కాహారం అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయ గౌరి, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

### నిత్యాన్నదానానికి బియ్యం వితరణ

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్,15: నిర్మల్ పట్టణంలోని దత్తసాయి ఆలయ ప్రాంగణంలో నిత్యం నిర్వహిస్తున్న అన్నప్రసాద కార్యక్ర మానికి తమ వంతుగా నిర్మల్‌కు చెందిన వైద్యులు శోభారాణి, సుభాష్‌రావు దంపతులు 5 క్వింటాళ్ల బియ్యం అందించారు. అన్నప్రసాద నిర్వాహకుడు సాయిదీక్షా సేవాసమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహర్‌రెడ్డికి మంగళవారం అందించారు.

## ఏఈ శ్రీనివాస్‌కు సన్మానం

దస్తురాబాద్,అక్టోబర్15 : మండలంలో 9 సంవత్సరాలుగా ఏఈగా, ఖానాపూర్ ఇన్‌చార్జి ఏడీఏగా విధులు నిర్వహించిన ఏఈ కెషెట్టి శ్రీనివాస్ బదిలీపై మంచిర్యాల జిల్లా చెన్నూర్ డివిజన్‌కి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనను మంగళవారం అధికారులు, సిబ్బంది సన్మానించారు. సబ్ ఇంజినీర్ నాగరాజు, లైన్‌మన్లు చర ణ్‌దాస్, సదానందం సైతం బదిలీపై వెళ్లారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## దస్తురాబాద్ నూతన ఏఈగా శ్రీనివాస్



బదిలీపై వెళ్తున్న ఏఈ శ్రీనివాస్‌ని సన్మానిస్తున్న సిబ్బంది

దస్తురాబాద్ మండల ఏఈగా తూముల శ్రీనివాస్ నియమితు లయ్యారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన కెషెట్టి శ్రీనివాస్ మంచిర్యాల జిల్లా చెన్నూర్ డివిజన్‌కి బదిలీపై వెళ్లారు. త్వరలో ఏఈగా తూముల శ్రీనివాస్ బాధ్యతలను స్వీకరించనున్నారు.

**సోన్, అక్టోబర్ 15 :** సోన్ మండల విద్యుత్‌శాఖలో ఏఈ శ్రీనివాస్ దస్తురాబాద్‌కు బదిలీ అయ్యారు. లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్లు బదిలీ అయ్యారు. వారిని సిబ్బంది సన్మానించారు.

## శారదమాత ఉత్సవాలు

భైంసా, అక్టోబర్, 15 : పట్టణంలో శారదమాత ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం బ్రహ్మణగల్లీలోని రాధాకృష్ణ భవన్‌తో పాటు ఆర్యవైశ్య భవన్‌లో పూజలు చేశారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నర్సాపూర్ (జీ), అక్టోబర్, 15: మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంరి లీఫ్ ఫండ్ చెక్కులను మాజీ సర్పంచ్ మహేశ్ మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన కాల్వ సంతోష్ రూ. 60 వేలు, కాల్వ భోజవ్వ రూ. 18 వేలు, కాసారం భూమన్న రూ. 54 వేల చెక్కులను అందజేశారు. మతిమ్మాపూర్ గ్రామానికి చెందిన సుశీ లకు మంజూరైన రూ. 19500 సీఎం సహాయనిధి చెక్కును మంగళవారం బీజేపీ నాయకులు వినోద్ రెడ్డి అందజేశారు.

## దళిత, అగ్ర కులాల మధ్య ఘర్షణ

భైంసా టౌన్, అక్టోబర్ 15 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని సిరాల గ్రామంలో మంగళవారం దళిత, అగ్ర కులాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో దళిత కుటుంబాల మధ్య చిన్న పంచాయతీ ఏర్పాటు చేశారు. అందులో ఒకరు గ్రామంలోని అగ్ర కులస్తులకు ఫోన్ చేయగా.. వారు రావడంతో ఎందుకు మా పంచాయతీకి వచ్చారని ఇరువురు గొడవ పడ్డారు. ఆ గొడవ ఒకరినొకరు కొట్టు కునే వరకు వెళ్లింది. దళిత మహిళలకు గాయాలు అయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విచారణ చేపడుతున్నమని పోలీసులు తెలిపారు.